వెన్నెల విరిగి పడింది...

చల్లని గాలి మెల్లగ వీస్తున్నది.

చల్లని వెన్నెల జలపాతమై కురుస్తున్నది.

జాజిపూల వాసనలు గాలితో పరుగెడుతున్నవి.

గడియారం పదిగంటలు కొట్టింది.

ఇందిర నిదుర రాని కన్నులతో పెరటిలోని వెన్నెలవైపు చూచింది. పెరటిలో వెన్నెల పవ్వళించింది ఒయ్యారంగా.

గాలి గట్టిగా వీచింది.

ఒక తీయని స్వరం గాలిలో కదిలి వచ్చింది.

ఒక్క ఉదుటున లేచి గది కిటికీ దగ్గరకు పరుగెత్తింది ఇందిర. కిటికీ లోంచి ఆత్రుతగా పెరటివైపు నున్న మేడపై గదివంక చూచింది.

'మనసున మల్లియలు

విల్లి విరిసాయి' — మేడపై గది లోంచి చల్లని వెన్నెలలో కదిలి జాలువారుతోంది అతని నోటినుండి తీయని పాట. తేనెజల్లు సన్నగ కురిపిస్తోంది వెన్నెల.

గదిలోనున్న విద్యుద్దీపకాంతిలో అతను కిటికీ ముందు కదలటం చూచింది ఇందిర.

కిటికీ చువ్వలకు మరీ దగ్గరగా కదలి, చువ్వలకు బుగ్గల నాచ్చి, ఆకాశం వైపు చూచింది ఇందిర. చల్లని చువ్వల చల్లదనం ఆమెలో తీయని అనుభూతిని కలిగించింది. చల్లగాలి ఒయ్యారంగా కదుయితూ ఆమె నుదుటిపైని ముంగురులతో సయ్యాట లాడుకుంటూ, ఆమె బుగ్గలలో విరిసిన గులాబీల అందాన్ని చూచుకుంటోంది.

ఆతని పాట ఆగిపోయింది.

గాలిలో కదిలే కొబ్బరాకులు, వర్షపు చుక్కలు నేలపై పడే శబ్దాన్ని చేస్తున్నాయి. గాలి కూనిరాగాలు తీస్తోంది.

మేడ గదిలోని విద్యుద్దీపాన్ని చూస్తూండిపోయింది ఇందిర. ప్రకాశరావు మంచంమీద కదిలిన శబ్దమైంది.

ఇందిర వెనుతిరిగి చూచింది ప్రకాశరావుని.

"ఇందూ! ఇంకా నిద్రపోలేదా?" అని అడిగాడు ప్రకాశరావు ఇందిర వైపు

'ఊర్వశి'

బద్ధకంగా చూచి. ఆతను పందిరిమంచం మీద హాయిగా పడుక్కున్న వెన్నెల వడిలోకి జరుగుతూ "ఊహూఁ! నిద్ర రాలేదు," అంది కిటికీవైపు తిరుగుతూ.

అత నింకేమీ అనలేదు. వెన్నెల పరుపుపై నిద్రకు ఒరిగాడు.

సన్నని తీవెలపై సన్నగ ఫిడల్ కమాను కదిలింది కాబోలు, సన్నగ విన వచ్చింది 'హంసా నందిని' రాగం. ఆనందంగా కిటికీవైపు చూచింది ఇందిర.

సృష్టిలో అత్యంత తీయనైన వస్తువు లందలి తీయదనం, అతి లలితంగా తీయబడి, వీనులు గ్రోలుటకు అనువుగా, వయోలిన్ తీవెలపైనుండి జాలువారుతూ చల్లని వెన్నెల సౌకుమార్యం ఒడలిలో నింపుకొని, మల్లెమొల్లల సువాసనలు ఒంటికి పట్టించుకొని స్రవంతిగా చేరు తోంది ఇందిర వీనులకు.

సంగీత స్రవంతిలో పయనిస్తూ చల్లని పిల్లతెమ్మరల ప్రేరితమువై విసరబడిన సంగీతపు తుంపర్ల చల్లదన ముచే పరవశించిన మనసుతో ఇందిర గవాక్షం ముందు నిలబడిపోయింది, వయోలిన్ తీవెలపై ఒయ్యారంగా కదిలి వచ్చే కృతిని ఆలకిస్తూ.

గానంలో లీనమై, పాటలో పాటయై వయోలిన్ తీగలో తీగ అయి ఉండి పోవాలని ఎగసిపడింది ఇందిర మనసు. కోర్కెలతో ఉబికిన గుండెతో, మనసున విడిసిన కోర్కెలకు ప్రతిరూపాలనిపించి, సముద్ర తరంగములవలె చల్లగాలిలో హాయిగ కదిలే ముంగురులతో, వెన్నెలలో వెన్నెలై, చీకటి అందాన్ని కాటుగగా కళ్ళకు రంగరించుకొని, వెన్నెలకే వన్నె తెస్తూ, మరిగిన పాలపై విడిసిన పాల తరగలా నిలిచిపోయింది గవాక్షం ముందు ఇందిర.

హిందోళ రాగం ఎప్పుడు మొదలైందీ ఆమెకు తెలియదు. 'సామజవర గమన' కృతి హాయిగా సాగిపోతూనే ఉంది.

స్వరకల్పనలలోని హొయలు పరవసింప జేసాయి ఇందిరను. మనసు ఉరికలెత్తి నృత్యం చేసింది ఇందిరలో. ఆమె కళ్ళలో కాంతి కిలకిల నవ్వింది. పెదవులపై చిరునవ్వు మొగ్గలు తొడిగింది.

కృతి అయిపోయింది.

పాట గాలిలో మిగిలిపోయింది.

కొద్దిసేపుకు మిగిలింది కొబ్బరాకుల ధ్వని.

గాలిలో నిండింది పాటలో తీయదనం.

ఆమెలో నిండింది తీయని ఒక బాధ.

పాట చిలకరింపులలో మిగిలిపోయిన మధురపు పాటతుంపరులు ఆమె వీనుల పెదవులపై మిగిలి అప్పుడప్పుడు ఆమెకు రుచి చూపుతూ నిలిచిపోయాయి.

గాలి అదే కృతిని సన్నగా పాడు కుంటోంది.

మేడగదిలో దీపం ఆరిపోయింది.

యాంత్రికంగా పందిరిమంచాన్ని



"నీలగిరి ఎందుకూ ? పూరీ పోదాం పదండి."

చేరింది ఇందిర. ఇందిరలో అసంతృప్తి చూడలేక కిటికీదాటి నింగికెగసిపోయాడు చంద్రుడు.

ఆమెను, అతనిని దరిచేర్చి, తన బిగి కౌగిటిలోకి తీసికోవాలని ఉబలాట పడింది నిద్రాదేవి.

అశాంతి, అసంతృప్తి ప్రజ్వలింప జేసిన జ్వాలలు వేడి నిట్టూరుపుల రూపంలో వెలికి పోయాయి.

ఆమె బుగ్గల రెండు పెదవులు చమత్కరించాయి. ఆమె కది హాయికాదు; ఆమెకప్పుడు కావలసిన దదికాదు.

'సంగీత స్రవంతిలో మునిగితేలాలి. ఆతని గానంలో పరవశించిపోవాలి. ఆ గానంలో ఆమె ఏమైనా ఆమెకు పరవా లేదు. ఆమె కది కావాలి. చాల రోజుల నుండి నిరీక్షింపబడుతున్న అది కావాలి; స్వేచ్ఛగా రెక్కలు విప్పుకొని పరుగెత్తి పోవాలి. కోయిలగొంతులో తను పాట పాడాలి'— అది ఆమెలో విరిసిన కోరిక.

ప్రకాశరావు కౌగిలినుండి స్వేచ్ఛ పుంజుకొని, బలంగా ఊపిరిపీల్చుకొని, ఎదురుగావున్న గోడపై దృష్టి సారించింది. గోడమీద వ్రేలాడుతోంది దుమ్ము పట్టిన వయోలిన్ పెట్టె.

ఆమెలో పాతతలపులకు తలుపులు తెరుచుకున్నాయి...

చప్పట్లు మిన్నుముట్టాయి.

విద్యుద్దీపాల కాంతిలో ఫ్లాష్లైట్లు ఒక్కసారి మెరిసాయి. అధ్యక్షుని చేతిలో వెండికప్పు తళ తళ మెరిసింది. ఆయన కన్నులలో తృప్తి నవ్వింది.

సభలో కేరింతలూ, చప్పట్లూ మరల, మరల మిన్ను కెగిసాయి.

తృప్తినిండిన గుండెతో కప్పు నందు కుంది ఇందిర. ఆడిటోరియమ్ హర్ష ధ్వానాలతో ఉక్కిరిబిక్కిరైంది.

కప్పు నందుకుని ఇందిర వేదిక దిగి, సగర్వంగా స్నేహితురాంద్ర వైపు నడిచింది.

బహుమతులుపంచిఇచ్చిన అధ్యక్షుడు ఇందిర సంగీత ప్రతిభను. ఆమె పాండితీ ప్రకర్షను విశేషంగా పొగడి, ఆమె ఉజ్జ్వలభవిష్యత్తునకై దేవునకు కేలు మోడ్చాడు.

సగర్వంగా వయోలిన్ వైపు చూచింది ఇందిర. ఆమె కన్నులలో కాంతి నిండి, ఆమెలో తృప్తి విరిసింది. మనసు పురి విప్పిన నెమలివలె నృత్యంచేసింది.

కాలేజీ ఆడిటోరియమ్ విడిచివస్తూ - అభినందించవచ్చినవా రందరికీ కృతజ్ఞ తలు తెలుపుకొని, వయోలిన్ పెట్టె పట్టుకొని రిక్షాఎక్కింది ఇందిర. మనసున విరిసిన వెన్నెల ఆమె ఎదుట నున్నదంతా స్వర్గతుల్యంగా ఆమె భావించ ప్రోత్స హించింది.

దారిలో యామినితో మనసు విప్పి చెప్పింది ఇందిర :

"నేను వయోలిన్ వాయిస్తూంటాను. అతడు నా గానానికి పరవశించి నాముందు ఉండిపోతాడు. మా మీద వెన్నెల కురుస్తూంటుంది. ఆ వెన్నెలలో తడిసి పోతాము. సంగీతస్రవంతిలో జలకా లాడతాము; వెన్నెల జలపాతంలో తడిసి పోతాము; ఆ ఆనందంలో ఉక్కిరి బిక్కి రవుతాము. పువ్వుల పరిమళాలను సంగీతస్రవంతిలో రంగరించిపోస్తాము. చల్లనిగాలి మాపాట వింటూ పరవసించి నృత్యంచేస్తుంది. పాటలో పల్లవి నేనై పోతాను; అతడు నాతోపాటు గొంతు రాగ మాలాపిస్తాడు; సంగీతస్రవంతిలో ఈతపందాలు వేసికుంటాం; అందులోనే, అక్కడే ఉంటాం; ఆ అమృతాన్నే గ్రోలుతాం; అక్కడే ప్రాణాలు వదులుతాం —" మానసవీణ పలికే ప్రతి పలుకూ యామినిముందు వ్యక్తం చేసింది ఇందిర.

"నీ మనసు తెలిసి, నీ గానామృతాన్ని గ్రోలే భర్తను దేవుడు ప్రసాదించాలనీ, నీజీవితం స్వర్గతుల్యం కావాలనీ ఆ భగ వానుని కోరుతున్నాను. నీవు అటువంటి భర్తనే ఎంచుకో. సంగీత రసజ్ఞత తెలిసినవానినే నీ హృదయమందిరంలో నిల్పుకో. నీకు విజయం చేకూరాలని దేవుని మనసారా ప్రార్థిస్తున్నాను," అంది యామిని నిండుగ.

ఇందిర మధుర భావాల పందిరిలో పెళ్ళికూతు రైపోయింది.



ఆమె తల్లిదండ్రులు, ఆమె అన్నదమ్ములు, అక్కయ్యలు, బావయ్యలు, వదినగార్లు అందరూ ఆమె సంగీతప్రజ్ఞ గుర్తించి గర్వించారేగాని, ఆమె మనోగతం తెలిసికొనలేకపోయారు.

'తనలో ప్రతిభ గుర్తించగల భర్త లభించాలి. సంగీత రసజ్ఞత తెలిసిన వారికే తన సన్నిధానంలో ఉండే అర్హత ఉంది. తనతోపాటు గొంతెత్తి పాడే భర్త కావాలి'— ఇదీ ఇందిరకోరిక; ఇదీ ఆమెలో నిలిచిన కల.

అత్యంత శ్రమ కోర్చి నేర్చుకుంది సంగీతం—కాలేజీవేళలకు, సంగీతపాఠాల వేళలకు ఒప్పకపోయినా, దూరమైనా, భారమైనా, అన్నింటినీ ఓర్పుతో సరిదిద్దుకొని నేర్చుకుంది సంగీతం. సంగీతలక్ష్మి సాక్షాత్కారానికై తపసు చేసింది. ఆమె తపము ఫలించింది. సంగీతానికి రూపకల్పన చేసింది. భావాలను జీవింపచేసింది. ఆ భావాలను కదిలే బొమ్మలు జేసింది. సంగీతంలో నూతనప్రక్రియలకైన అన్వేషణలో తృప్తి సాధించుకుంది.

సంగీతమే జీవితమైంది.

స్వరకల్పనలే గమ్మత్తైన సమస్యలైనాయి. సంగీతసాధనే జీవితధ్యేయమైంది.

పరవసించిపోవటంలో ఆమెకు అన్నపానీయాలు లభించాయి.

కాలానికిఉండేవేగం ఆమెకు తెలియలేదు. కాలేజీ వదలిపెట్టేసింది.

ఆమె వివాహం కుటుంబమందరి బాధ్యతైంది. పెళ్ళికుమారులకై అన్వేషణ గడిచింది. ఇందిర తన భావాలను వ్యక్తం చేసింది వరులముందు. అర్హత లేని వరులు పెళ్ళికి అంగీకరించలేక పోయారు.

ఆమెలో వెన్నెల మసక జారింది.

ఆమెలో అశాంతి మొక్క మొలిచింది.

కొన్నినాళ్ళకు ఆమె వివాహం ఒక సమస్యగా పరిణమించిం దా ఇంటిలో.

ఆమె కన్నది కలే అని నిర్ధారణకు వచ్చింది ఇందిర.

సంగీతగంధం లేని ప్రకాశరావును వివాహం చేసికోక తప్పలేదు.

అయినా ఒక ఆశ ఆమెలో గాలి పీల్చుకుంటూనే ఉంది.

సంగీతానికి తలూపని జీవి లేదనీ, సంగీతం ఆస్వాధించలేనివా రుండరనీ ఆమె నమ్మకం. అదే నమ్మకంతో ప్రకాశరావుకు సంగీతాభిరుచి కలిగించి, తనముందు నిలుపుకోవాలని ప్రయత్నించింది ఇందిర

'రాగాల భేదాలు తెలియకపోవచ్చు; తాళాల మార్పులు గుర్తెరగకపోవచ్చు; స్వరకల్పనలో మెలకువలు తెలియక పోవచ్చు; కాని, ప్రతి మానవుడు శృతి, అపశృతుల మధ్యగల కొట్టవచ్చినట్టు కనపడే తేడా గుర్తించగలడు. అపశృతి లేకుండ వెలువడే నాదాన్ని, సంగీతంగా గుర్తించి ఆస్వాదించకుండ ఉండలేడు–' అనుకునేది ఇందిర. కాని సంగీతమంటేనే చెవులు మూసుకునే ప్రకాశరావుకు శృతి, అపశృతులు గుర్తించే పాటి శ్రద్ధ ఎందుకుంటుంది?

'స, రి, గ, మ, ప, ద, ని'ల మధ్య సృష్టింపబడిన సంగీతం నిత్య జీవితంలో ప్రతిపాటకు ప్రాతిపదికగా ఉందనీ, రాగ, తాళ, భావాలతో వెలువడే ప్రతిదీ సంగీతమేననీ, సంగీతమనేది ప్రత్యేకంగా ఏదీ లేదనీ, గీతంలో స, రి, గ, మ లు దొర్లినంత మాత్రాన దానిని ద్వేషించేపని లేదనీ, ప్రతి కృతి ఒక్కొక్క మాదిరి లెఖలాంటిదనీ, నాటి నుండే నిత్యజీవితంలో కూనిరాగాలు తీసికొని, ఈలపాటలు పాడుకునేందుకు పాటలు ఉద్భవిస్తున్నాయనీ తెలియని మేధమేటిక్సు లెక్చరర్ ప్రకాశరావుకు తెలియజెప్పలేకపోయింది ఇందిర.

నాటుబోటుమీద బండిని భుజాలపై వేసికొని పరుగెత్తే ఎడ్లమెడలో మువ్వలు సృజించేనాదంలో 'సంగీత' మున్నదనీ–

చెట్లు పుట్టలు దాటుతూ, రైలుపట్టాల మీద రైలుచక్రాలు చేసే ధ్వనిలో చక్కటి 'లయ' ఉందనీ–

బండల రాళ్ళపైనుండి పారే నదీ నీరాలు చేసే శబ్దాలలో తీయని 'పాట' ఉందనీ–

తాటిచెట్టు చిట్టచివర ఒంటిగ విడివ

డీన తాటాకు చీలి సన్నగ సాగే గాలిలో లయబద్ధంగా ఆడుకుంటుందనీ – తెలియని ప్రకాశరావులో సంగీతాభిరుచి కలిగించటం సీటితో దీపాన్ని వెలిగించటం– అని అనుకుంది ఇందిర.

ఇందిరకు పెళ్ళయిన కొత్తలో ఒక నాడు:

ఆరోజు వెన్నెల పండుగ చేసికుంటోంది.

ఇందిరను పిలవడానికి వెన్నెల, ఇందిర ఇంటి డాబాపై తిష్ఠ వేసింది.

మంచంమీద తాంబూలం సేవిస్తూ వెన్నెల్లోకూర్చున్న ప్రకాశరావు గుండె మీద తల వాల్చిన ఇందిర అంది 'హాయిగా పాడుకుందామా ?' అని.

"నేనా ? నాకు పాటలు రావు. నీవు పాడు, నేను వింటాను."

"ఉండండి, వయోలిన్ తెస్తాను," అంది ఇందిర.

"అ దెందుకు ఇందూ మధ్యన ?" అన్నాడు.

"నా గొంతు అంత శ్రావ్యంగా ఉండదు. వయోలిన్ మీద అయితే పాట పాడుకోడాని కేమీ ఇబ్బంది ఉండదు," అంది.

"బాగోకపోయినా ఫరవా లేదు. అలాగే పాడు. నీవుమాత్రం కదిలి పోకు," అన్నా డతను.

కొద్ది క్షణాలలో తెలిసికుంది ఇందిర– అతడికి కావలసినవి సినీమాపాట లనీ; ఏ త్యాగరాజుకృతీ అతన్ని మెప్పించ లేదు అనీ. మళ్ళీ ఏనాడూ అలాంటి కోరిక కోరలేదు అతన్ని. వెన్నెల రాత్రులు చాలా గడిచిపోయాయి. ఏనాడూ వయోలిన్ నోరు మెదల్పలేక పోయింది. వయోలిన్ పాడుకోడానికి అవకాశమున్నా, నిరాశకొండల ఎదుట పాడుకోడానికి ఆమె మనసు అంగీకరించలేదు.

ఒక్కొక్కరోజు ఎవరో విద్వాంసుడు రేడియోలో గానం చేస్తూంటాడు. ఇందిర ఆ స్టేషన్ పెట్టుకొని వంటింటిలో పని చేసికోడానికి వెళ్ళిపోతుంది. కొద్దిసేపటిలోనే ఆమెకు 'సిలన్' రికార్డ్సు వినవస్తాయి. ఇందిర దెబ్బతిన్న పక్షిలా గిలగిల లాడుతుంది.

కాలం గడిచిపోతునేఉంది.

సిలన్ పాటలు, ఇంగ్లిషు ట్యూన్సు, ఆమె తీరని కోరికలను బందీ చేశాయి.

వయోలిన్ గోడ కెక్కింది.

వయోలిన్ పెట్టె దుమ్ము పట్టింది.....

వారంరోజుల క్రితమే ఖాళీగా ఉన్న పెరటింటి మేడపై అతడు దిగాడు. అంతకుముందు చాలాకాలంనుండి ఆ మేడ ఖాళీగానే ఉంటోంది. ఒకానొక రోజు అనుకోకండా మేడపైనుండి సన్నగ వెలువడే వాయిద్యం విని పరుగులెత్తింది ఇందిరమనసు మేడమీదికి.

పగలు ఇంట నుండ డతను.

రాత్రి తొమ్మిది, పది గంటలకు ఇల్లు చేర్తాడు. ఒక గంటో, అరగంటో పాట పాడుకుంటాడు; తరువాత నిద్రపోతాడు.

ఆతని పాట వినగానే ఆమెలో ఆశ చిగిర్చింది. ఆమెలో కోర్కెలు మొలకెత్తాయి. అతని సంగీతం ఆమెలో శారదరాత్రులు పూచాయి.

ప్రతీరోజు అతని పాటకై వేచి ఉండటం, పాట వింటూ అవ్యక్తానందం అనుభవించటం, గీతం అయినవెనుక ఆమె తన దురదృష్టానికై అంగలార్చటం పరిపాటి అయిపోయింది ఇందిరకు.

'తా నున్నది నరకంలో, ఎదుటనున్నది స్వర్గం' అన్న తలంపు ఆమెకు వచ్చినప్పుడల్లా ఆమెలో తీవ్రసంచలనం కలిగేది. దాని పర్యవసానం, తా నున్న జీవితంపై రోతా. తను ఉన్న వాతావరణంపై విసుగూ ఆమెలో భగ్గుమండేవి.

జ్ఞాపకాలను నెమరువేసికుంటున్న ఇందిరకు చాల రాత్రివరకూ నిద్ర పట్టలేదు. మూడుగంటలు అయినతరువాత మగతనిద్ర పట్టింది.

నిద్రపోతున్న ఇందిరకు తీయని సంగీతం వినవచ్చింది. ఉలికిపడి లేచింది ఇందిర. మేడమీద గదిలో దీపం వెలిగి ఉంది. గదిలోనించి వినవస్తోంది వయోలిన్‌నుండి సంగీతం. ఇందిర మంచం మీదనుండి లేచి కిటికీముందు నిలబడింది. సంగీత సుధాంబుధి పొంగి పొరలిపోతున్నది. నెమ్మదిగా పెరటిలోకి వెళ్ళి నిలబడింది ఇందిర. చంద్రుడు మబ్బు పరదాలనుండి వెలువడి, అవి కనుచూపు మేరలో లేకుండా చూచుకొని, తారలతో హాయిగా ప్రణయగీతిక లాలపిస్తున్నాడు. చల్లగాలిని కవ్విస్తున్నాడు. వెన్నెల జలపాతంలో స్వేచ్ఛగా జలకమాడుతున్న పూవులవైపు సిగ్గులేక ఒళ్ళంతా కళ్ళు చేసికొని చూస్తున్నాడు చంద్రుడు.

సంగీతం రసాస్థాయి నందుకుంది.

సంగతులలో చమత్కృతులను ఒక్కబిగిని చూపిస్తున్నా డతను. ఒకొక్క గమనంలో ఒకొక్క భావం, ఒకొక్క భావంలో ఒకొక్క రూపం, ఒకొక్క రూపంలో ఒకొక్క అనుభూతిని చూపిస్తున్నా డతను.

రాగస్థాయి పెంచటంలో ప్రతిభను అతిసున్నితంగా చూపిస్తున్నా డతను.

రబ్బరులా సాగే గాలిలో హాయిగా పయనిస్తున్నది గీతం. ఆ గీతంలో పయనిస్తోం దొక తీయని భావం. ఆ భావనలో మెరిసిం దొక తీయని తలపు. అదే తలపు ఇందిరలో స్వేచ్ఛకు ప్రాణం పోసింది.

ఇంటిలోకి పరుగెత్తింది ఇందిర.

ధూళిధూసరితమైన ఫిడల్ పెట్టె గోడనుండి దింపింది. పెట్టె తెరచి ఫిడల్ అందుకొని పెరటిలోకి పరుగెత్తింది; చీరచెరగుతో ఫిడల్ గబగబా తుడిచి, అతనికి ప్రత్యర్థిగా నిలచి, పెరటిలో ఉండి, స్వరకల్పనలో తన స్వతంత్ర భావాలను, కల్పనలలో ఊహించని హొయలను వ్యక్తంచేసింది ఇందిర.

ఆమె పిలుపు నందుకొని అతను ఆమెకు చక్కటిసమాధానం చెప్పడంలో నిమగ్నుడైనాడు. ఆమె రూపొందించిన సంగతులకు తీసిపోనివానిని సృజించి విడిచిపెట్టా డతను.

అతను ప్రాణం పోసిన ప్రతి స్వరమునకు కళను దెచ్చింది ఇందిర.



పోటీ ముమ్మరంగా సాగిపోతున్నది.

ప్రకృతి ఊపిరి బిగబట్టింది

చంద్రుడు కంగారుగా చూస్తున్నాడు వారివైపు. ఆమెకు ఒంటినిండా చెమటలు పట్టేసింది. అయినా తన పట్టు వీడలేదు. తన ధీరత ప్రకటిస్తూనేఉంది.

అతను ఆగిపోయాడు. అది ఓడిపోడానికి గుర్తు.

విజయశంఖం పూరించి ఇందిర కూడా ఆగిపోయింది. అతను పరుగున మేడ దిగివచ్చాడు. ఇందిర ముందు వయోలిన్‌తో నిలిచాడు.

"మీరు నన్ను గెలిచారు. నేను మీతో ఓడిపోయాను," అని వయోలిన్ ఆమె ముందుంచి, ఆమెను సమీపించి "మీ సంగీతం నన్ను ముగ్ధుడిని చేసింది. నేను మీ దాసుడను. నాతో వచ్చేయండి. సంగీతసామ్రాజ్యంలో రాజ్యం చేదాం," అని అన్నాడు.

ఇందిర అతనివైపు భయంగా చూచి వెనక్కు ఒక్క అడుగు వేసింది.

"సందేహిస్తారేం? మీ మనసు నాకు తెలుసు. మీకు ప్రకాశరావు ఏది ఈలేదో దాన్ని నే నియ్యగలను. రండివెడదాం," అంటూ చెయ్యి పట్టుకున్నాడతను.

ఆమె నేదో అవ్యక్తశక్తి వెనక్కు లాగింది. "వద్దు. వద్దు, నన్ను వదలండి;" అంటూ కేకలు వేసింది.

"కోర్కెలు చంపుకొని ఎంతకాలం మసలగల రతనితో. వచ్చేయండి," అంటూ ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

"వద్దు, వద్దు; నన్ను వదలండి." అంటూ కెవ్వున కేకవేసి క్రింద పడి పోయింది ఇందిర.

"ఇందిరా ! ఇందిరా ! ఏమిటి ? కల గన్నావా ? కళ్ళు తెరువు," అంటూ భుజాలు గట్టిగా తట్టి అంటున్న ప్రకాశ రావు మాటలు విని కళ్ళుతెరచి చూచింది.

అంతా కల !

అయోమయంగా అతనివైపు చూచింది.

"కలగన్నావా?" అంటూ ఆమెముఖం మీది చమట తుడిచాడు ప్రకాశరావు.

ఏదో మాటాడబోయి మాటాడలేక ప్రకాశరావు చేతుల్లోకి ఒరిగిపోయింది ఇందిర.

ఉదయ పవనాలలో 'మలయ మారుతం'లో కృతి చల్లగ చేరింది ఇంది రను. హాయిగా సాగిపోతోంది కృతి. జోగుతున్న ప్రకృతి నిద్రలేచి హాయిగా ఆవులించింది పక్షుల కిలకిల రావాలకు తోడు, ప్రకృతి హాస్యం. పన్నీరు జల్లులాంటి తీయని కృతి క్రొత్త అందా లను కూర్చుతున్నాయి, ఇందిర మనసులో వెన్నెల ఉవ్వెత్తుగ ఎగసింది. కాని ఆ ఆహ్లాదం ఎంతోకాలం నిలువలేదు. కృతి వింటూంటే కలిగిన తీయని అను భూతి ఎందుకో ఒక్కసారి కొరడుబారి పోయింది. విరిసిన వెన్నెల ఒక్కసారి తిరిగి పడిపోయింది. మెరుపుతీవెలమధ్య నృత్యంచేసే మనసు ఒక్కసారి చీకటి అగాధాలలోకి జారిపోయింది.

మనసులో చీకటితుఫాను చెల రేగింది. సన్నటి తీవెలమీద హాయిగా సాగిపోయే 'హంసానందిని' రాగంలో ఇప్పుడు తీయదనంలేదు. ఆ గానంలో ప్రశాంతపు అలలు లేవు.

ఆ గానంలో విరిసిన ప్రతిస్వరం ఉధృతమై ఉవ్వెత్తుగ లేచే సముద్రపు టల — ఆ గానానికి ప్రాణమైన రాగం; ఆమెకు మూర్ఖమై వీచే తుఫానుగాలి — కమాను చూపే ప్రతి గమనంలోని మెలకువా, భూమిని మూటగట్టి మింగే ఉరుము సమానం.

ఆతని గానం ఆమెకు మత్తెక్కిం చటంలేదు. ఆమెను పిచ్చి ఎక్కిస్తోంది.

ఆతని గానంలో తీయని హాసంలేదు. ఆతనిగానంలో ఆమెకై పరిహాస ముంది.

ఆతని గానంయెడ ఆమెకు గౌరవం లేదు భయ ముంది.

ఉధృతమై, భీభత్సమై, వికటహాసం చేసే సముద్రపుటలలు ఒక్కసారి మిన్ను కుండిపోయాయి

ఆతని గానం ఆగిపోయింది.

అప్పుడే బద్ధకంగా ఆవలిస్తు ప్రక్కమీద పొర్లాడుతున్న ప్రకాశరావుక దగ్గరగా జరిగి అన్నది ఇందిర.

"మన మీ ఇల్లు మారిపోదాం," అని

— —